క్లుప్తంగా

భగవద్గీత పారాయణం చేయాలి


ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న నిర్విషానంద స్వామి

సారవకోట: ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలని నిర్విషానంద స్వామి అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో ఆదివారం 107వ ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. భగవద్గీతలో మనం నిత్యం ఎదుర్కొనే ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని నిర్విషానంద స్వామి అన్నారు. మూల తాతయ్య, సనపల కరుణాకర్, అల్లు రామయ్య, సోమేశ్వరరావు, తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. నిర్వాహకులు మోహన్‌రావు, మెండ సన్యాసిరావు పాల్గొన్నారు.

వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా సాంబశివరావు



హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలం వెలమ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా గొట్టిపల్లి గ్రామానికి చెందిన శిమ్మ సాంబశివరావు ఎంపికయ్యారు. అసోసియేషన్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా యంబరాం సర్పంచ్ వి.గోవిందరావు, ట్రెజరర్‌గా కరకవలస గ్రామానికి చెందిన మెండ మోహన్‌రావు ఎంపికయ్యారు. వీరు ఎంపికపై వెలమ సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలియజేశారు.

ముమ్మర తనిఖీలు


కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పాతపట్నం: ఒడిశా – ఆంధ్రా సరిహద్దులోని పాతపట్నం చెక్ పోస్ట్ వద్ద పాతపట్నం సీఐ వి.రామారావు ఆధ్వర్యంలో ఒడిశా నుంచి వచ్చే వాహనాలను పోలీసులు ఆదివారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి ఆంధ్రాలోకి వచ్చే బస్సులు, కారులు, ఆటోలు, పలు వాహనాల్లో గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ అప్పారావు, పోలీసులు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు


మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఆమదాలవలస: పట్టణంలోని 7వ వార్డు చింతాడలో గల మెట్టక్కివలస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సమితి కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావధానులు శిబిరాన్ని ప్రారంభించారు. 100 మందికి సత్య సాయి సమితి ప్రతినిధి డాక్టర్ పి.తాతయ్యలు, వైద్యులు హేమంత్, రమేష్, ఎం.పద్మ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, సత్య సాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

బండార్లమ్మా.. దీవించమ్మా..


ముర్రాటలు తీసుకెళ్తున్న మహిళలు


బండార్లమ్మ గ్రామ దేవత

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని బండార్లమ్మ వీధిలో గల బండార్లమ్మ గ్రామ దేవత 17వ వార్షికోత్సవాన్ని ఆదివారం కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి వేకువ జామునుంచే ముర్రాటలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మహా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, అందరూ సంతోషంగా ఉండేలా చూడాలని గ్రామ దేవతను కోరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

ఆమదాలవలస: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం సోమవారం చేపట్టనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ సి.హెచ్.ప్రభాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవస్థానం వద్ద దేవదాయశాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలు తెరిచి కానుకలు లెక్కించేందుకు నిర్ణయించినట్లు ఈఓ తెలిపారు. ఆసక్తి గల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని కోరారు.

పూర్తయ్యేది ఎప్పుడో?

- బిల్లులు లేక నిలిచిన భవన నిర్మాణాలు
- అర్ధాంతరంగా నిలిచిన ఆర్బీకేలు, సచివాలయాలు, ఇతర భవనాలు
- బిల్లులు అందకపోవడంతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- ప్రజా సేవలకు అంతరాయం


బాణాపురంలో శ్లాబ్ లెవల్‌లో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవనంలో ఎడ్ల బండి, ట్రాక్టర్లు ఉంచిన దృశ్యం

మెళియాపుట్టి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ల నిర్మాణాలు సార్వత్రిక ఎన్నికల అనంతరం నిలిచిపోయాయి. బిల్లులు నేటికీ చెల్లించలేదని కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. కొన్నిచోట్ల పూర్తయిన భవనాల్లో సేవలందిస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో అత్యధిక గిరిజన ప్రాంతం కావడంతో ఈ భవనాల్లో ఉద్యోగులు నిత్యం ఉంటూ సేవలందించే పరిస్థితి ఉండేది. అధిక మొత్తం భవనాల్లో సగం నిర్మాణ దశలోనే నిలిచిపోవడంతో ప్రజలకు సేవలు అందడం లేదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, ప్రతీ సచివాలయానికి సిబ్బందిని నియమించి ప్రజలకు సకాలంలో సేవలందించారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాలను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో మంజూరైన సచివాలయ భవనాలు, నిర్మించినవి, నిర్మాణంలో ఉన్నవాటి వివరాలు

మండలం	సచివాలయాలు	మంజూరైన భవనాలు	పూర్తయినవి	నిర్మాణ దశలో ఉన్నవి
మెళియాపుట్టి	21	56	22	34
కొత్తూరు	27	71	54	17
పాతపట్నం	18	32	11	21
హిరమండలం	13	24	18	6
ఎల్.ఎన్.పేట	12	35	26	9

భవనాలు పూర్తి చేయాలి



గత ప్రభుత్వంలో ప్రజల వద్దకే సేవలందించాలన్న సంకల్పాన్ని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి. నిలిచిన ప్రతీ భవనాన్ని పూర్తిచేయాలి. గిరిజన గ్రామాల ప్రజలు, రైతులకు సేవలందించాలి. భవనాలు అలా విడిచిపెట్టడం వల్ల ప్రజాధనం వృథా అవుతుంది.

– లండ వెంకటరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి, మర్రిపాడు–కె, మెళియాపుట్టి మండలం

త్వరలో పనులు ప్రారంభిస్తాం

మధ్యలో నిలిచిన పనులు పూర్తిచేయడానికి కృషి చేస్తున్నాం. ఈ విషయాన్ని పాతపట్నం ఎమ్మెల్యే దృష్టిలో పెట్టాం. ప్రస్తుతం స్లాబ్ లెవెల్‌లో ఉన్న భవనాల పనులు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. బేస్‌మెంట్ దశలో ఉన్న భవనాల నిర్మాణాలకు సమయం పడుతుంది.

– ఆనంద్, ఏఈ, పంచాయతీరాజ్, మెళియాపుట్టి


మెళియాపుట్టిలో బేస్‌మెంట్ దశలో ఉన్న బీఎంసీసీ భవనం

తవ్వారు.. విడిచిపెట్టారు..!


తవ్వి వదిలేసిన వైశ్య వీధిలో రోడ్డు

- కుళాయిల నిర్మాణం కోసం మూడు నెలల క్రితం రోడ్డును తవ్వారు
- పైపులైన్ అమర్చకుండా రోడ్డుపైనే వదిలేసిన పరికరాలు..


అమర్చకుండా రోడ్డుపై వదిలేసిన పైపును చూపుతున్న స్థానికులు

సారవకోట: మండలంలోని అవలింగి గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా వేసిన ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి ఈ ఏడాది మార్చిలో పలు వీధుల్లో తవ్వకాలు చేపట్టారు. నేటికీ తవ్విన చోట పైపులైన్లు వేయకపోవడంతో ఆ గోతుల్లో పాములు, విష కీటకాలు చేరుతున్నాయి. గ్రామంలోని కూరాకుల వీధిలో ఇంటింటికీ కుళాయిలకు సంబంధించిన పైపులైన్ కోసం గోతులు తవ్వకుండా.. ఇరుగ్గా ఉన్న రోడ్డుపై సంబంధిత కాంట్రాక్టర్ పైప్‌లైన్ వేశారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఆ మార్గంలో రాత్రిపూట నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పలుమార్లు సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పరిష్కరించలేదని ఆ వీధికి చెందిన కోట అమ్మాయి, కోట తేజ, గంగాడ ఉష, జగ్గయ్య, తదితరులు ఆరోపించారు. ఇంటింటికీ వేసిన కుళాయిలు లేవు.. వచ్చిన నీరులేదు.. కానీ రోడ్డుకు అడ్డంగా వేసిన పైపులైన్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. నెలల తరబడి పైపులైన్ అలాగే ఉందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి పైపులైన్ల కోసం గోతులు తీసి పూడ్చకుండా విడిచి పెట్టారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కూరకూల వీధి ప్రజలు కోరుతున్నారు.

మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్నాం..



ఇంటింటికీ కుళాయిలు వేస్తామని మూడు నెలల క్రితం పైపులైన్ తీసుకొచ్చారు. పైపులైన్ వేసేందుకు గోతులు తీసి అమర్చాల్సి ఉన్నా.. అలా చేయకుండా చిన్న రోడ్డుపై పైపులైన్ వేసి వదిలేశారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చే సమయంలో పైప్‌లైన్‌కు కాళ్లు తగిలి చాలా మంది పడిపోతున్నారు. దీనిపై సచివాలయ సిబ్బందికి పలుమార్లు తెలియజేసినా ఫలితం లేదు.

– సోనేన శ్యామ్, అవలింగి, సారవకోట మండలం

చర్యలు తీసుకుంటాం..

తాగునీటి కుళాయిలకు సంబంధించిన సమస్య ఇంతవరకు తన దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం.

– ఆర్.మధు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ఆక్రమణలు తొలగించండి


నిరసన తెలుపుతున్న చిట్టివలస, కొల్లివలస గ్రామాల యువకులు

ఆమదాలవలస: మండలంలోని చిట్టివలస పంచాయతీలో ఆక్రమణలు తొలగించాలని, సీర పోలమ్మ పేరిట మంజూరు చేసిన అక్రమ డీ పట్టాను వెంటనే రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన యువకులంతా కలిసి సైలాడ రెవెన్యూ, సంఘమేశ్వరస్వామి ఆలయ సమీపంలోని కొండపై ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. భూములు ఉన్నవారికి 2017–18లో మంజూరు చేసిన డీ పట్టాలను రద్దు చేయాలన్నారు. అప్పటి రెవెన్యూ అధికారులు డీపట్టా ఇచ్చి.. ఎన్ని సెంట్లు అనేది ఇవ్వలేదన్నారు. సైలాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 183లో ఉన్న కొండ ప్రాంతాన్ని కొంత మంది వ్యక్తులు 294, 295–2, 296–1, 296–3 సర్వే నంబర్లతో గతంలో అక్రమంగా పట్టాలు పొందారన్నారు. ప్రస్తుతం కొండ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాకలు వేస్తున్నారని, మొక్కలు నాటుతున్నారన్నారు. కొండ ప్రాంతంలో రాళ్లు తీసుకుంటూ జీవనం సాగిస్తున్నవారిని ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశామన్నారు. అనర్హులకు ఇచ్చిన డీ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చిట్టివలస మాజీ సర్పంచ్ గుజ్జల లక్ష్మణరావు, యువకులు బంటుపిల్లి కూర్మారావు, నవిరి యర్రన్నాయుడు, నవిరి అర్జునరావు, శ్రీనివాసరావు, ఎస్.కూర్మారావు, ఎస్.చిన్నారావు, ఎస్.లక్ష్మణరావు, బమ్మిడి అచ్యుతరావు, ఎం.నవీన్, గ్రామ పెద్దలు, కొల్లివలస గ్రామానికి చెందిన చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం


మాట్లాడుతున్న రామరాజు

కొత్తూరు: కవులు కష్టజీవుల పక్షపాతిగా వ్యవహరిస్తారని జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రామరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రామరాజు అన్నారు. కొత్తూరు మండల కేంద్రంలో కొత్తూరు మండల రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వేదిక అధ్యక్షుడు కలమ శ్రీరాములు అధ్యక్షతన కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. కష్టజీవులు పడుతున్న కష్టాలను కవి తన రచనల ద్వారా సమాజానికి వివరిస్తారన్నారు. కొత్తూరు కవనం పుస్తకం రూపకల్పనకు సహకరించిన రామరాజుకు కవులు సత్కరించారు. పలువురు కవులు తమ స్వీయ కవితలను వినిపించారు. కవులకు రామరాజు చారిటబుల్ ట్రస్టు తరపున రామరాజు సత్కరించారు. గత నెలలో నిర్వహించిన తెలుగు భాష ప్రావీణ్యతపై నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అభినందిస్తూ ప్రశంసాపత్రాలను అందించారు. కొత్తూరు మండలానికి చెందిన పలువురు కవులు పాల్గొన్నారు.

నియామకం..


పోలయ్య

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యనిర్వాహక మెంబర్‌గా కొత్తూరుకు చెందిన గుడబండి పోలయ్యను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ విషయాన్ని పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు ఆదివారం తెలిపారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి పోలయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పటిష్టత కోసం తనవంతు కృషి చేస్తానని పోలయ్య అన్నారు. పోలయ్య నియామకంపై పార్టీ మండల అధ్యక్షుడు, పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కనీస వేతనం అమలు చేయాలి

పొందూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్స్‌కు కనీస వేతనం, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఏపీ పాఠశాల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. ఏపీ పాఠశాల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని పొందూరులోని నెహ్రూ పార్కు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్లౌజులు, మాస్కులు ఇవ్వాలని, సరిపడా పనిముట్లు అందించాలని కోరారు. వేసవి సెలవుల్లో పనిచేసినందుకు పూర్తివేతనం అందించాలన్నారు. ఈ సమావేశంలో పొందూరు మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎస్.పద్మ, ప్రధాన కార్యదర్శిగా కె.పార్వతి, సభ్యులుగా బి.రాజు, ఆర్.కోటమ్మ, ఎల్.లక్ష్మి, వై.కృష్ణవేణి, ఆర్.జాన్సీ, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..


మోహన్‌రావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని ధనుకువాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మెండ మోహన్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడు ఈగల చన్నారావు, ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, పార్టీ నాయకులు రెడ్డి రామారావు, శిమ్మ సాంబశివరావు, మెండ వాసుదేవరావు, కెల్ల గణపతిరావు, లోచర్ల మల్లేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

అపూర్వ కలయిక


2005-06 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు, కుటుంబ సభ్యులు

హిరమండలం: మండల కేంద్రంలోని షిర్డీ సాయి ట్యూషన్ సెంటర్‌లో 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకచోట కలిసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా కుటుంబ సభ్యులతో కలిసి సందడిగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు బెహరా భాస్కరరావు, సుధాకర్, సురేష్‌ను ఘనంగా సన్మానించారు.


హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేటలో క్యూఆర్ కోడ్‌ను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు


ఆమదాలవలస: వెంగళరావు కాలనీలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు


నరసన్నపేట: చిక్కాలవలసలో క్యూఆర్ కోడ్‌ను అందజేస్తున్న ఎంపీపీ ఆరంగి మురళి, నాయకులు

‘కూటమిది దగాకోరు పాలన’

సూపర్ సిక్స్, ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు అన్నారు. ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట, కృష్ణాపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, ఎంపీపీ రెడ్డి జ్యోతి లక్ష్మి, నాయకుల ఆధ్వర్యంలో రెడ్డి శాంతి ఆదివారం నిర్వహించారు. కొత్తూరు మండలంలోని నివగాం, మాతల, కుద్దిగాం, పొనుటూరు గ్రామాల్లో ఎంపీపీ సవర సావిత్రి, జెడ్పీటీసీ సభ్యురాలు కె.భాగ్యవతి, పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ 20వ వార్డు వెంగళరావు కాలనీ, 2వ వార్డు కృష్ణాపురం గ్రామాల్లో ఆయా గ్రామాల పార్టీ ముఖ్య నాయకులు కుప్పిలి సత్యనారాయణ, బొడ్డేపల్లి సూర్యారావు, కూన వరం, కూన రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్ హాజరయ్యారు. బూర్జ మండలంలోని పెద్దపేట పంచాయతీ మదనాపురంలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చింతాడ రవికుమార్ పాల్గొన్నారు. నరసన్నపేట మండలంలోని మండలం చిక్కాలవలస, సుందరాపురం, బాడాం పంచాయతీల్లో ఎంపీపీ ఆరంగి మురళి ఆధ్వర్యంలో, సారవకోట మండలంలోని కిడిమి, జమచక్రం, సత్రాం గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ ఆధ్వర్యంలో, జలుమూరు మండలంలోని తిమడాం, సురవరం గ్రామాల్లో ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు, నాయకుల ఆధ్వర్యంలో, పోలాకి మండంలోని గంగివలస, ప్రియాగ్రహారం, చెల్లాయివలస పంచాయతీల్లో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రికాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టోను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కూటమి నాయకుల మోసాలను వివరించారు. పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజవకర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కొత్తూరు: నివగాంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి


బూర్జ: మదనాపురంలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు


సారవకోట: కిడిమిలో క్యూ ఆర్ కోడ్‌లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


జలుమూరు: తిమడాంలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గోపి, నాయకులు



పోలాకి: ప్రియాగ్రహారంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు